ప్రజాశక్తి
ఆదివారం 7 డిసెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

మడకశిరలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ప్రజాసంఘాల నాయకులు

దుర్గం పీఠం దక్కేదెవరికో..!

మరో మూడునెలల్లో పదవీకాలం ముగుస్తున్న కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ పదవి రాజకీయవేడిని రాజేస్తోంది. నాటకీయ పరిణామాల మధ్య వైసీపీ ఛైర్మన్ రాజ్‌కుమార్‌ను తొలగించారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి ఛైర్మెన్‌గా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన తిమ్మప్ప వ్యవహరిస్తున్నారు. ఈయన నియామకంపై వైసీపీ సమన్వయకర్త రంగయ్య ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఛైర్మన్ ఎన్నిక అనివార్యం అయ్యింది.



- ◆ మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం కూటమి, వైసీపీ పాట్లు
- ◆ కౌన్సిల్ సభ్యులు చేజారకుండా వ్యూహాలు
- ◆ కీలకం కానున్న ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు
- ◆ మొదలవుతున్న క్యాంపు రాజకీయాలు
- ◆ 11న ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మరో మూడునెలల్లో పదవీకాలం ముగుస్తున్న కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మెన్ పదవి రాజకీయవేడిని రాజేస్తోంది. నాటకీయ పరిణామాల మధ్య వైసీపీ ఛైర్మన్ రాజ్‌కుమార్‌ను తొలగించారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి ఛైర్మెన్‌గా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన తిమ్మప్ప వ్యవహరిస్తున్నారు. ఈయన నియామకంపై వైసీపీ సమన్వయకర్త రంగయ్య ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఛైర్మన్ ఎన్నిక అనివార్యం అయ్యింది.

కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను ఈనెల 11న నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నేపథ్యంలో మూడు నెలలైనా ఛైర్మన్‌గా ఉందామని అటు అధికార కూటమి, ఇటు ప్రతిపక్ష వైసీపీకి సంబంధించిన కౌన్సిల్ సభ్యులు ఆశలు పెంచుకున్నారు. బీసీ జనరల్‌కు ఛైర్మన్ స్థానం దక్కాల్సి ఉంది. ఈలెక్కన ఇరుపార్టీల్లో ఆయా వర్గాల సభ్యులు ఛైర్మన్ స్థానం కోసం పైరవీలు మొదలుపెట్టారు. అధికారపార్టీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో ఆపార్టీ బీసీ కౌన్సిలర్లు ఇప్పటికే తమ పేరు పరిశీలన చేయాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతిపక్ష వైసీపీలో సమన్వయకర్త రంగయ్య అశీస్సులపై ఆ పార్టీ కౌన్సిలర్లు ఆశలు పెట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఆయా పార్టీలకు సంబంధించిన కౌన్సిలర్లు చేజారిపోకుండా కూటమి, వైసీపీ నేతలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు.

అధికారం, వర్కుల పేరుతో కూటమి ధీమా

అధికార కూటమిలో అధికారం, వర్కుల పేరుతో కౌన్సిల్ సభ్యులు చేజారకుండా జాగ్రత్త పడడంలో నిమగ్నమయ్యారు. సభ్యులు చేజారరనే దీమా కూటమిలో కనిపిస్తోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో కేవలం నలుగురు మాత్రమే టీడీపీ మద్దతుతో గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గౌతమి బీజేపీలో చేరి కూటమిలో కలిసిపోయింది. 2024 సాధారణ ఎన్నికల ముందు కొందరు, కూటమి అధికారంలోకి వచ్చాక ఇంకొందరు ఆరు మంది వైసీపీ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కౌన్సిల్‌లో టీడీపీకి 11 మంది బలం పెరిగింది. టీడీపీ మద్దతుతో గెలుపొందిన కౌన్సిల్ సభ్యులు ప్రతిపక్షం వైపునకువెళ్లే అవకాశాలు కనిపించడంలేదు. వైసీపీ నుంచి టీడీపీకి వచ్చిన సభ్యులపై ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు అప్రమత్తమయ్యారు. మూడునెలల పదవీకాలమే ఉన్నా పదవి చేజారితే అసలుకే ఎసురొస్తుందని అధికార పార్టీ నాయకులు జాగ్రత్త పడుతున్నారు. ఇదే విషయంపై శనివారం ప్రజావేదిక వద్ద కౌన్సిల్ సభ్యులతో గంటలు తరబడి అధికార పార్టీ ముఖ్యనేతలు చర్చలు జరిపారు.

ఉన్న సభ్యులను కాపాడుకునే పనిలో వైసీపీ

కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా అప్పట్లో వైసిపి నుంచి 19 మంది గెలుపొందారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి అధికారంలోకి రాగానే ఆరుగురు పార్టీని వీడిలో టిడిపిలో చేరారు. ప్రస్తుతం ఉన్న 13 మందిని కాపాడుకుని తమ సత్తా చాటాలని వైసిపి సమన్వయకర్త రంగయ్య వ్యూహ రచన చేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యనాయకులతో రంగయ్య సమాలోచనలు చేస్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లే కీలకం

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఆరుమంది, అప్పటికే కూటమిలో ఉన్న ఐదు మంది సభ్యులను కలిపితే ఆపార్టీకి 11 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ సమయంలో ఎక్స్‌ఆఫిషియో సభ్యులుగా ఓటుపొందే ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లే ఛైర్మన్ ఎన్నికలో కీలకం కానున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లతో కూటమి బలం 13కు చేరుతుంది. ఎమ్మెల్యే ఓటు పక్కాగా ఇక్కడున్నట్లే , ఎంపీ ఓటు ఏడు నియోజకవర్గాల్లో ఎక్కడా వినియోగిస్తారనే దానిపై స్పష్టత లేదు. ఇవి కాకుండా వైసీపీ నుంచి ఎవరైనా వచ్చేవారుంటే లాక్కుంటే ఛైర్మన్ పదవి లాగేసుకునేలా కూటమి ప్రయత్నాలు చేస్తోంది.

పదవికోసం ఇరుపార్టీల్లోనూ ఆశావహులెక్కువే

ఛైర్మన్ పదవికోసం కూటమి, ప్రతిపక్ష వైసీపీలో ఆశావాహులు ఎక్కువగానే ఉన్నారు. కూటమిలో బీసీ వర్గానికి చెందిన కౌన్సిలర్లు అచ్చుపల్లి అనిత, వెంకటేశులు, నూర్జహాన్‌లతో పాటు వైసీపీ నుంచి వచ్చిన బాలరాజేశ్వరులు కూడా ఉన్నారు. ఇక కూటమిలో ఉన్న బీజేపీ సభ్యురాలు గౌతమి కూడా ఆశిస్తున్నారు. ఇదివరకే ఎమ్మెల్యే గౌతమి కుటుంబసభ్యులను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం. కూటమిలో బీజేపీకి ఈ పదవి ఇస్తే మునుముందు జరిగే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీకే అన్ని ఇచ్చుకొవచ్చనే అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీలో బీసీ వర్గానికి చెందిన కౌన్సిల్ సభ్యులు సురేష్, పూసల భాగ్యమ్మ, కుర్ర వెంకటేశులు, తిరుమల చంద్రమ్మ, లక్ష్మన్న, పరమేశ్వరప్పలు ఉన్నారు. వీరిలో ఎవరిని ఛైర్మెన్‌గా నిలుపుతారనేది ఆపార్టీలో స్పష్టత కనిపించడంలేదు.

ఇప్పటిలెక్క చూస్తే ఇరుపార్టీలకు సమానబలం

కౌన్సిల్‌లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లను పరిగణలోకి తీసుకుంటే ఛైర్మన్ ఎంపికలో ఇప్పుడున్న పరిస్థితిని బట్టి కూటమి, ప్రతిపక్ష వైసీపీకి సమానబలం ఉంది. టీడీపీ తీర్థం పుచ్చుకున్న సభ్యులు, ఆపార్టీ మద్దతుతో గెలుపొందిన సభ్యులతో కలిపితే 11 మంది బలం కాగా ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లతో బలం 13కు చేరుతుంది. ఇప్పటికే వైసీపీలో 13 మంది కౌన్సిల్ సభ్యులున్నారు. అధికార, ప్రతిపక్షంలో ఏ ఒక్క సభ్యున్ని ఎవరు కోల్పోయిన ఛైర్మన్ ఎంపికలో బంగపాటు తప్పదు. దీంతో ఇరుపార్టీలకు ఛైర్మెన్ ఎంపిక సవాల్‌గా మారింది. దీనికి తోడు ఛైర్మన్ ఎంపికలో ప్రతిపక్ష వైసీపీ విప్ జారీచేస్తే మరోపార్టీ అభ్యర్థికి ఓట్లువేసే కౌన్సిలర్లకు పదవీ గండం తప్పదనే భయం వారిలో ఉంది.

స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్

వర్ధంతి కార్యక్రమాల్లో పలువురు వక్తలు
జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

పుట్టపర్తి: అసమానతలు లేని సమాజం కోసం రాజ్యాంగాన్ని అందించి దేశానికి దిశ, దశ చూపిన స్ఫూర్తి ప్రధాత డా॥బిఆర్.అంబేద్కర్ అని పలువురు కొనియాడారు. అంబద్కెర్ 69వ వర్ధంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఆయా ప్రాంతాల్లో ఆయనకు నివాళులు అర్పించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, ఆయన జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం అన్నారు. అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించి భారత రాజ్యాంగాన్ని అందించిన అపర మేధావి అంబేద్కర్ అని పలువురు కొనియాడారు.

హోంగార్డుల సేవలు అమోఘం

హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా హోంగార్డులు నిర్వహిస్తున్న విధులు అమోఘమన్లి ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా శిరసాని పరేడ్ మైదానంలో 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ముందుగా సాయుధ హోంగార్డుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1963 సంవత్సరంలో ఆవిర్భవించిన హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందన్నారు. పోలీసులతో సమానంగా శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో 305 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని, వీరు అన్ని విభాగాల్లో పోలీసులతో సమానంగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రసంశించారు. ప్రతి ఒక్క హోంగార్డు నిజాయితీగా పని చేసి పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లాలో హోంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా కవాతు ప్రదర్శన నిర్వహించిన హోంగార్డ్స్ తో పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేసిన ఎఆర్ ఆర్మూడ్ రిజర్వుడ్ ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు మహేష్, వలి, ఆర్ఎస్ఐలను ఎస్పీ అభినందించారు. అనంతరం హోంగార్డులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ శివాంజనేయులు, ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ ఎస్ఐ ప్రసాద్, ఎఆర్ శ్రీరాములు, హోంగార్డ్ ఇన్‌ఛార్జి రామాంజనేయులు పాల్గొన్నారు.

హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ

హిందూపురం జిల్లా ఆసుపత్రిలో మరో స్క్రబ్ టైఫస్ కేసు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో స్క్రబ్ టైఫస్ కలకలం రేపుతోంది. ఇప్పటికే చిలమత్తూరు మండలానికి చెందిన రామ్ శివ అనే సంవత్సరం బాలుడుకి ఈ వ్యాధి లక్షణలతో హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాజగా శనివారం సాయంత్రం మరో కేసు నమోదు అయింది. హిందూపురం రూరల్ మండలం కిరికెర గ్రామానికి చెందిన మరియమ్మ (42)కు ఈ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆమె గత వారం రోజులుగా జ్వరం, అయాసంతో బాధ పడుతోంది. వైద్యులకు అనుమానం వచ్చి పరీక్షలు నిర్వహించగ స్క్రబ్ టైఫస్ జ్వరంగా గుర్తించారు. వెంటనే ప్రత్యేక వార్డులో ఈమెను ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రధానంగా వరి పొలాల్లో ఉండే ఒక రకమైన చిన్న పురుగు కుట్టడం వల్లే ఈ స్క్రబ్ టైఫస్ వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి వల్ల ప్రజలు ఎవరూ భయపడాల్సిన పనిలేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ అన్నపూర్ణ తెలియజేశారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం డిఇఒ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తారని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తప్పనిసరిగా స్టడీ అవర్స్‌కు హాజరవ్వాలన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు జయచంద్ర, సోమశేఖర్ నాయుడు, హెచ్ఎం గోపాల్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకో వాలని ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక షిరిడి నగర్‌లో శనివారం ఎపి చేనేత కార్మిక సంఘం మండల సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చేనేత కార్మిక సంఘం జిల్లా సమితి నాయకులు శీలా నారాయణస్వామి మాట్లాడుతూ చేనేతకు ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టణంలో చేనేత కార్మికుడు నీలూరి కృష్ణమూర్తి అప్పులకు వడ్డీ కట్టలేక నేసిన చీరలకు గిట్టుబాటు లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం మండల నాయకులు కిష్టప్ప, నాగరాజు, వెంకటేశులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సవిత

మెగా చెక్కును అందిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో మంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వయం సహాయక సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. మహిళల స్వశక్తీకరణ, ఆర్థిక స్వావలంబన, సంక్షేమ పథకాల అమలు, తదితర అంశాలపై విస్తృత చర్చ నిర్వహించారు. గ్రామీణ మహిళల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. మహిళల సామాజిక, ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేసేందుకు వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంద న్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సిఎం చంద్రబాబు సరిదిద్దుతూ సుపరిపాలన అందిస్తున్నార న్నారు. స్త్రీ నిధి రుణం కింద 1,974 మంది సభ్యులకు రూ. 18.06 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. సామాజిక పెట్టుబడి ఉన్నతి బ్యాంక్ లింకేజ్ ద్వారా 1,413 మందికి రూ.138.46 కోట్లు విడుదల య్యాయి. సీడ్ క్యాపిటల్ పథకం కింద 141 మందికి రూ. 55.10 లక్షలు చెల్లించారు. రైతు ఉత్పత్తిదారులకు రూ. 1,03,94,000వేల సహాయం, ఓఎస్ఎస్‌సిఎఫ్ పథకం కింద 49 మందికి రూ. 24.50 లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్వామా పిడి నరసయ్య, సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు, మహిళా నాయకురాళ్లు, స్వయంసహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

8న మడకశిరకు అంధుల టీ-20 క్రికెట్ కెప్టెన్ దీపిక రాక

ప్రజాశక్తి-మడకశిర టౌన్

అంధుల టీ-20 క్రికెట్ టీమిండియా జట్టు కెప్టెన్ దీపిక ఈ నెల 8వ తేదీ మడకశిర పట్టణానికి రానుంది. దీంతో ఆమెకు పట్టణంలో ఘన స్వాగతం పలకడంతో పాటు రాజీవ్ గాంధీ సర్కిల్ నుంచి జూనియర్ కళాశాల ప్రాంగణం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అంధుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన తర్వాత దీపిక మొట్టమొదటిసారి నియోజకవర్గానికి వస్తుండడంతో భారీగా ఘన స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లపై శనివారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపల్స్, ఎంఇఒలు, మున్సిపల్, పోలీస్, క్రికెట్, వాలీబాల్, పుట్‌బాల్ అసోసియేషన్ల సభ్యులతో సమావేశం నిర్వహించారు. దీపిక సన్మాన సభను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎస్పీ, ఆర్‌డిటి ప్రతినిధులు, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నరసింహనరసింహా, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా కర్నాటక మద్యం, నాటుసారా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. ఆయన శనివారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలిం చారు. ప్రతి షాపులో ఎక్సైజ్ ఎపి సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసిన తర్వాతే మద్యం అమ్మకాలు జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తరచూ బెల్ట్ షాపులుపై దాడులు నిర్వహించి, అక్రమా లకు పాల్పడితే కేసులు నమోదు చేయాలన్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సిఐ చంద్రమణి, ఎస్ఐలు నాగరాజు, చాంద్‌బాషా ఉన్నారు.

ఎక్సైజ్ సిబ్బందితో మాట్లాడుతున్న నాగమద్దయ్య

నాడు తల్లి... నేడు తండ్రి మరణం

◆ అమ్మానాన్న మృతితో అనాథలైన ఆడపిల్లలు ◆ ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

అనారోగ్యంతో తల్లి మరణించింది. అప్పటి నుంచి అన్నీ తానై ఇద్దరు ఆడపిల్లల ఆలనా పాలనా తండ్రి చూసేవారు. ఆ ఆడపిల్లలను వెంటాడిన కష్టం తండ్రిని కూడా వారికి లేకుండా చేసింది. ఆలనాపాలనా చూస్తున్న తండ్రి శనివారం నాడు గుండెపోటుతో మరణించాడు. తల్లిదండ్రులిద్దరూ మరణించడంతో ఆడిపిల్లలిద్దరూ అనాథలయ్యారు. శనివారం నాడు మరణించిన వారి తండ్రి మృతదేహం వద్ద ఇద్దరు ఆడపిల్లల తమకు దిక్కెవ్వరు అంటూ కన్నీటి పర్యవంతం అయ్యారు. కష్టం వెంటాడిన ఈ ఇద్దరి ఆడపిల్లల విషాద జీవనం వివరాలు ఇలా ఉన్నాయి...

తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న కూతుర్లు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండల కేంద్రం వైఎస్ఆర్ కాలోనీలో నివాసం ఉంటున్న భజంత్రి గోపాల్(45) తన వృత్తిని నమ్ముకుని జీవనం చేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుతురు అక్షిత హిందూపురం పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతోంది. రెండవ కుమార్తె వందన పరగి కెజిబివి పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. 8 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో గోపాల్ భార్య అనిత మతి చెందింది. అప్పటి నుంచి అన్నీ తానై ఇద్దరు ఆడబిడ్డల ఆలనా పాలనా చూశారు. శనివారం నాడు తండ్రి భజంత్రీ గోపాల్ గుండెపోటుతో మరణించాడు. తల్లిదండ్రులు ఇద్దరూ మరణించడంతో వారి ఇద్దరి ఆడపిల్లల అనాథలయ్యారు. తండ్రి మృతదేహం వద్ద వారిద్దరూ కన్నీటి పర్యవంతం అయ్యారు. ఇద్దరు కుర్తెలు తమకు ఇక దిక్కెవరు అంటూ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది.

అపన్నహస్తం కోసం ఎదురుచూపు

తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన ఆడపిల్లలు అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు ఒక చిన్న చేయి చాచి, ఒక అమ్మాయి భవిష్యత్తును కాపాడవచ్చు. వారికి తల్లిదండ్రులను తెచ్చిపెట్టలేకపోయిన భవిష్యత్తును తీర్చిదిద్దగలం. బాలికలకు అండగా పరిగి దివ్య ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పరిగి వేణుగోపాలరావు రూ.5 వేలను అందించారు. ఇలాంటి దాతలు మరికొందరు వచ్చి అమ్మానాన్నలు లేని ఆడపిల్లల్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. అపన్నహస్తం అందించాలనుకునే వారు బి.అక్షిత కెనెరా బ్యాంక్ ఐఎఫ్ఎస్‌సి నెంబరు సిఎన్ఆర్‌బి 0013134, ఖాతా నెంబరు 31342200115879 సహాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాత్రికేయుల సాయం

తల్లితండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఆ ఆడబిడ్డలకు తాము సైతం మీకు అండగా ఉంటామని పరిగి మండల పాత్రికేయులు నిలిచారు. మృతుడు భజంత్రి గోపాల్ ఇంటికి వెళ్లి తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. ఆడపిల్లలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గుడిబండకు చేరిన కృష్ణా జలాలు

సంబరాలు చేసుకున్న రైతులు, టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-గుడిబండ

హంద్రీనీవా కాలువల ద్వారా ఎట్టకేలకు మండలంలోకి కృష్ణా జలాలు ప్రవేశించాయి. మండల రైతులు, ప్రజల 15 ఏళ్ల నిరీక్షణ శుక్రవారం ఫలించింది. తెల్లవారుజామున మండలంలోని రాళ్లపల్లి గ్రామ పొలిమేరలోకి చేరుకున్నాయి. ఈ విషయం తెలిసి శంకరగల్లు గ్రామపంచాయతీ రైతులు, ప్రజలు హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లి హర్షం వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతుండడంతో వారు పరవశించిపోయారు. పలువురు రైతులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఎదురు చూశామని, ఎట్టకేలకు కృష్ణా జలాలు మండలంలోకి ప్రవేశించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కృష్ణా జలాలు రాళ్లపల్లి పొలిమేరలోకి ప్రవేశించాయని తెలుసుకున్న పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హంద్రీనీవా కాలువ వద్దకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవతో సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మండలానికి కృష్ణా జలాలు తీసుకొచ్చి ఎన్నికల హామీని నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాదిపల్లెప్ప, సత్యనారాయణ, పూజారి నాగేంద్రప్ప, పూజారి రంగస్వామి, పవన్ కుమార్, చంద్రశేఖర్, గోవిందరాజులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ చొరవతో హిందూపురం పట్టణం ఎంజిఎం క్రీడా మైదానం, రహమత్‌పురం సచివాలయం, మున్సిపల్ కార్యాలయంలో అధునాతన మరుగుదొడ్ల నిర్మాణానికి శనివారం మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ వాటా 33% (రూ. 14.79 లక్షలు), రాష్ట్ర ప్రభుత్వ వాటా 22శాతం (రూ. 9.86 లక్షలు), మున్సిపాలిటీ వాటా 45శాతం (రూ.20.19 లక్షలు) మొత్తం రూ.44.84 లక్షలతో అధునాతన మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ దస్తగిరి, ఫిజికల్ డైరెక్టర్ లోకనాథ్, టీడీపీ నాయకులు నెట్టప్ప, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, ఛైర్మన్

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ జాతీయ మహాసభల నేపథ్యంలో శనివారం పుట్టపర్తిలో సిఐటియు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ జాతీయ మహాసభలో భాగంగా జనవరి 4వ తేదీ భారీ బహిరంగ సభ ఉంటుందని, ఆ సభకు సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. మహాసభలో లేబర్ కోడ్‌ల రద్దు, బిల్డింగ్ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, గంజాయి, డ్రగ్స్, మద్యం పూర్తి స్థాయిలో రద్దు, తదితర విషయాలపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగార్జున, పెద్దన్న, నరసింహులు, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, యుజిడి యూనియన్ నాయకులు నాగరాజు, పెద్దన్న, భవన నిర్మాణ కార్మికులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. కార్మికులు, ప్రజా సంఘాలు, సిఐటియు నాయకులు శనివారం స్థానిక హోటళ్లు, దుకాణాలు, కార్యాలయాలను సందర్శించి రూ. 22,220 విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని మహాసభల ఏర్పాట్లకు రాష్ట్ర కేంద్రానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామచంద్ర, వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, నరసింహ, నారాయణప్ప, రాధమ్మ, నాగమణి, అంగన్వాడీ ప్రాజెక్టు డివిజన్ ప్రధాన కార్యదర్శి శోభారాణి, రాంతులసి, ఈశ్వరమ్మ, పద్మావతి, లక్ష్మినరసమ్మ, తులసి, అలివేలమ్మ, అశ్వర్థమ్మ, ఆశా కార్మిక సంఘం లక్ష్మి, వరలక్ష్మి, అరుణ, రాహమత్‌బి, అలివేలమ్మ, గాయిత్రి పాల్గొన్నారు.

ముదిగుబ్బ : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఎపి ట్రాలీ యూనియన్ ఆటో స్టాండ్ వద్ద మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే సిపిఎం నాయకులు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబ్‌జాన్, కోకన్వీనర్ శ్రీరామిరెడ్డి, గౌరవాధ్యక్షులు టైలర్ ముస్తఫా, రైతు సంఘం నాయకులు వెంకటేష్, పోతలయ్య, ఆవాజ్ నౌషాద్, అల్లా బకాష్, రిక్షా ముస్తఫా, ఎపి ట్రాలీ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో సిఐటియు ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తున్న నాయకులు

హిందూపురం : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్.రాము పిలుపునిచ్చారు. మహాసభల గోడపత్రికను మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులతో కలిసి నూతన మార్కెట్ భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని, ఇది కార్మికుల హక్కులను కాలరాయడమే అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిన్నింటిపై చర్చించి పోరాట కార్యాచరణ రూపకల్పన కోసం జరిగే సిఐటియు జాతీయ మహాసభను అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి మురళి, అధ్యక్షులు నరసింహమూర్తి, కోశాధికారి మల్లయ్య, సహాయ కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షులు రామాంజనప్ప, మంజు, కిరణ్, రంగనాథ్, మహేశ్వరమ్మ, కవిత, గంగరత్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆక్రందనలు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆరుగాలం కష్టపడి సాగుచేస్తున్న అన్నదాత ఆక్రందనలు పాలకులకు వినిపించడం లేదు. ప్రకృతి వైపరిత్యాలు ఒకవైపు దెబ్బతీస్తుంటే... గిట్టుబాటు ధరల్లేక మరోవైపున రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. గడిచిన నెల రోజులుగా అరటి రైతులు గిట్టుబాటు ధరలేదని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రైతు సంఘాలు, ప్రతిపక్షాలు అరటి రైతును ఆదుకోవాలని కోరుతూనే ఉన్నారు. కాని ప్రభుత్వం ఆ రైతును ఆదుకునే చర్యలేవీ చేపట్ట లేదు. ఉద్యానవన కాన్క్లేవ్‌ల్లో ఉద్యానవన రైతును ఎక్కడికో తీసుకెళుతామని ప్రకటించిన నేతలెవరూ అరటి రైతు కష్టాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. చివరకు ఒక రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పుట్లూరు మండలం వెల్లుట్లలో నాగలింగం అనే రైతు అప్పుల బాధతో నాలుగు రోజుల క్రితం తన పొలంలోనే పురుగుల మందు తనువు చాలించాడు. ఈ ఆత్మహత్యను ప్రభుత్వం పంట సాగు వల్ల కాదు... వ్యాపారంలో వచ్చిన నష్టాలే కారణమని చెప్పేందుకు ప్రయత్నాలు చేస్తుండడం విస్మయం కలిగిస్తోంది. ఏ రైతు ఆత్మహత్య చేసుకున్నా పెద్దగా స్పందించని వ్యవసాయ శాఖ మంత్రి నాగలింగం మరణంపై స్పందించి ప్రకటన జారీ చేయడం గమనార్హం. ఈ వారం రోజుల వ్యవధిలో పామిడి, కూడేరులో ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ రైతు ఆత్మహత్యలపై ప్రజాప్రతినిధులెవరూ స్పందించలేదు. కనీసం ఆ కుటుంబాలను ఆదుకుంటామన్న ప్రకటనా లేదు. కాని నాగలింగం విషయంలో మాత్రం ఆయన వ్యాపారంలో నష్టాలతోనే చనిపోయినట్టు చెప్పే ప్రయత్నాలు చేయడంతోపాటు ప్రభుత్వం ఆదుకుంటుందని హామీనిచ్చారు. ఇతర రైతు కుటుంబాల విషయంల ఆప్రకటన ఎందుకు రాలేదన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే రైతు ఆత్మహత్యలుగా ప్రభుత్వం పరిధిలో నమోదయి కూడా పరిహారం అందని వారు జిల్లాలో పదుల సంఖ్యలోనే ఉన్నాయి. వారు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఆ కుటుంబాల రోదనలు అరణ్య రోదనలుగానే ఉన్నాయి. ఇది ఇలాగుంటే పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. మొక్కజొన్న రైతులు అనేక రోజులు డిమాండ్ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం ఇప్పటి వరకు పంటల కొనుగోళ్లపై ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు. అదే విధంగా పంటనష్టానికి సంబంధించి కూడా ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సీడీ, పంటలబీమా ఏదీ అందలేదు. ఎప్పటికిస్తారో కూడా ప్రభుత్వం వైపు నుంచి ప్రకటనలేదు. ఇలా అన్ని విధాలుగానూ రైతులకు ఇక్కట్లు తప్ప సహాయం అందుతున్న పరిస్థితి లేదు. దీనిపై రైతు సంఘాలు ఎప్పటి కప్పుడు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. అయితే ప్రభుత్వం వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు.

ఈ వారంలో ఎపి రైతు సంఘం అనంతపురం జిల్లా మహాసభ జరిగింది. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం పరిధిలో ఈ మహాసభ జరిగింది. ఈ మహాసభ సందర్భంగానూ రైతు సమస్యలపై ప్రతినిధులు చర్చించారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి నిర్వహణపైనా ఈ వారం పెద్ద చర్చనీయాంశంగా మారింది. పిఎబిఆర్ కుడి కాలువ గేట్లు తెరుచుకోకపోవడంతో ఇంజినీర్లు అనేక ప్రయత్నాలు చేసి చివరకు తెరిచారు. దీంతో పిఎబిఆర్ నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేశారు. నిర్వహణకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ వస్తున్నాయి. ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయిస్తున్నది చూడాల్సి ఉంది.

అనంత వీక్షణం

'స్క్రబ్ టైఫస్'పై అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని దర్శనమల పిహెచ్‌సిలో శనివారం వైద్యాధికారి డాక్టర్ దిలీప్ కుమార్ రోగులకు 'స్క్రబ్ టైఫస్' వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి 'రికెట్ సియా' బ్యాక్టీరియా ద్వారా వస్తుంద న్నారు. ఈ బ్యాక్టీరియా మైట్స్ అనగా పిడుదులు, చిడుములు వంటి వాటిలో ఉంటుందన్నారు. రికెట్ సియా బ్యాక్టీరియా ఉన్న మైట్స్ మనిషిని కుట్టిన పది రోజుల్లో ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ఒక మనిషి నుంచి మరొకరికి వ్యాపించదని తెలిపారు. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం, శరీరంపై దద్దుర్లు, మైట్స్ కుట్టిన చోట నొక్కబడినట్లు ఎర్రటి పుండు ఏర్పడి నల్లటి పెచ్చులతో కూడి ఉంటుందన్నారు. రక్ష పరీక్ష చేయడం ద్వారా వ్యాధిని గుర్తించవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేస్తారన్నారు. ఎలుకలు, చుంచు ఎలుకలు సంచరించే ప్రాంతాలను మూసి వేయాలని, పొలా ల్లో గడ్డి కోసే వారు చేతులు, కాళ్లకు రబ్బర్ చెప్పులు, గ్లౌజెస్ ధరించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి డా. జి.మునిచంద్రిక ఆసుపత్రికి వచ్చిన రోగులకు 'స్క్రబ్ టైఫస్' వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, చికిత్స, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శివరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్' వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న పుట్టపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి మునిచంద్రిక

ముదిగుబ్బ : స్థానిక బాలికల బీసీ హాస్టల్, కెజిబివిలో డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో మెడికల్ స్క్రీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అనారోగ్యంగా ఉన్న విద్యార్థినులకు అవసరమైన మందులు ఇచ్చారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు, నివారణ గురించి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సరస్వతమ్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

11న ధర్మవరంలో వాజ్‌పేయి కాంస్య విగ్రహ ఏర్పాటు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 11వ తేదీ పట్టణంలోని కాలేజీ సర్కిల్ వద్ద మంత్రి సత్య కుమార్ యాదవ్ సారథ్యంలో సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. వాజ్‌పేయి ప్రధానిగా సమగ్ర భారత నిర్మాణానికి చేసిన కృషి, దేశ రాజకీయాలకు అందించిన విలువలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అలాంటి మహోన్నత నేత కాంస్య విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయడం నియోజకవర్గ ప్రజలకు గర్వకారణమన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,087 మంది పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.

రొద్దంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతోంది. ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి వచ్చే వారు ద్విచక్ర వాహనాలను ప్రధాన రహదారిపై పార్కింగ్ చేయడం, దీనికి తోడు కొందరు దుకాణదారులు సరుకులు రోడ్డుపై పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రెండు వరుసల రోడ్డు ఉన్నా కూడా ఎదురెదురుగా వాహనాలు వెళ్లాల్సి వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక వారపు సంత రోజైతే ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. సంతరోజు పోలీస్ స్టేషన్ వద్ద నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకూ సుమారు అర కిలో మీటర్ ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడాల్సిందే అని ప్రజలు వాపోతున్నారు. చిన్నయ్య టీ కొట్టు ఏరియా, బ్యాంకు ఏరియా, తదితర ప్రాంతాల్లో సమస్య చాలా తీవ్రంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. వీటికి తోడు రోడ్డుపై అక్కడక్కడ మట్టి కుప్పలు ఉండడం కూడా ట్రాఫిక్ సమస్యకు ఓ కారణం అవుతోంది.

రొద్దంలో ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

రామాలయానికి ఎమ్మెల్యే విరాళం

తలుపుల : మండలంలోని నూతనకాల్వ గ్రామంలో రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, కందికుంట యశోదదేవి దంపతులు విరాళం ప్రకటించారు. రూ. 5 లక్షలను శనివారం గ్రామ పెద్దలు ఓబుళరెడ్డి, రాజకుమార్‌నాయుడుకు అందజేశారు.

ఆలయానికి గేటు వితరణ

చిలమత్తూరు : దాతల సహకారంతో మండలంలోని మరవకొత్తపల్లి బిసి కాలనీ సమీపంలో కుశావతి నది ఒడ్డున ఉన్న ఏటిగడ్డ గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపట్టినట్లు పూజారి గంగాధర్ తెలిపారు. అందులో భాగంగా శనివారం మండలంలోని చిన్నన్నపల్లి రమేష్‌రెడ్డి ఆలయానికి ఇనుప గేటు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-అమడగూరు

మండల వ్యాప్తంగా టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేద్దామని ఆ పార్టీ పరిశీలకులు శైలజవెంకటేష్ సూచించారు. మండలంలోని మహమ్మాదాబాద్‌లో శనివారం పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ విధి విధానాలను తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి, అందించాల్సిన బాధ్యత నాయకులదే అన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు సిద్ధలింగప్ప, శ్రీరాములు, సూర్యనారాయణ, మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, కమ్మల భాస్కర్, డైరీ శ్రీనివాసులు, టైలర్ రామాంజులు, మధు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి డికె.బాబు ఆర్థికసాయం

తలుపుల : కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీలో నివాసం ఉండే పఠాన్ నవీద్ కుమార్తె సభా ఖానమ్ గోల్డ్ షాట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండి యా భారత జట్టుకు ఎంపికైంది. ఆమె ట్రైనింగ్ నిమిత్తం పూణే నుండి నేపాల్‌కు వెళ్లింది. అక్కడ ఆమె ఫీజు, ఇతర ఖర్చులకు శనివారం వైసిపి మండల కన్వీనర్ డికె.బాబు రూ. 40వేలు అందజేశారు.

పశువైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని సున్నంపల్లివారి పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పాడి పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పాడి పశువుల సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధిగ్రస్త పశువులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. కొక్కంటి, కొర్తికోట, బాలసముద్రం, మల్లిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన తేదీల్లో వైద్య శిబిరాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.హరినాథ్‌రెడ్డి, బొంతలపల్లి పశువైద్య సహాయకులు పి.విజయ్‌కుమార్, పశుసంవర్ధక సహాయకులు మణికంఠ, జి.విజయ్‌కుమార్, బి.రవీందర్‌నాయక్, గోపాలమిత్ర జి.నరసింహులు, ట్రైనీ బి.గంగోత్రి పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ యత్నం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఉన్న అమృత మద్యం షాపులో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. వారు వెంట పెట్రోల్ తీసుకొచ్చి తాళంపై పోసి నిప్పంటించి దొంగతనం చేసేందుకు ప్రయత్నించారు. అయితే తాళం తెరుచుకోకపోవడంతో పెట్రోల్ బాటిల్‌తో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ రైడర్లకు ఎస్పీ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పెనుకొండ

పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. పెనుకొండ బాబయ్య స్వామి ఉరుసు సందర్భంగా 44వ జాతీయ రహదారిపై బైక్ రేసింగ్‌లో పాల్గొన్న కర్నాటక, ఆంధ్రాకు చెందిన పలువురు యువకుల ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అలాగే శనివారం డీఎస్పీ కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనదారుల తల్లిదండ్రులు, బైక్ రైడర్లకు ఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. బైక్‌లతో ఇష్టారాజ్యంగా బైక్ రైడ్ చేయడం నేరం అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలకు గురైతే తల్లిదండ్రులు బాధపడాల్సి వస్తుందన్నారు. నిబంధనలు అతిక్రమించిన 102 వాహనాలను సీజ్ చేశామని, మొదటిసారి రావడంతో జరిమానా విధించి వాహనాలు అప్పగిస్తున్నామన్నారు. ప్రతి బైక్‌పై రూ.5వేల నుంచి రూ 10 వేల వరకూ జరిమానా విధిస్తున్నామన్నారు. వాహనాల రికార్డులు అధికారులకు చూపించి జరిమానా చెల్లించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. ఇలాగే కొనసాగితే కేసులు నమోదు చేసి వాహనాలను తిరిగి ఇవ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, సిఐ రాఘవన్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఎపి ఎన్‌జిఒ అసోసియేట్ ప్రెసిడెంట్ మురళీకృష్ణగౌడ్

ప్రజాశక్తి-బుక్కపట్నం

ఉద్యోగుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని సత్యసాయి తాలూకా ఎపి ఎన్‌జిఒ అసోసి యేట్ ప్రెసిడెంట్ మురళీకృష్ణగౌడ్ తెలిపారు. పుట్టపర్తిలో శుక్రవారం జరిగిన ఎపి ఎన్‌జిఒ ఎన్నికల్లో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మురళీకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లా డుతూ ఎపి ఎన్‌జిఒ ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమం, హక్కులకు కాపాడడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాన న్నారు. ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి హక్కుల కోసం పోరాడుతానని తెలిపారు. తన ఎన్ని కకు సహకరించిన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాధవ్, జిల్లా నూతన అధ్యక్షులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారులు, సిబ్బంది మురళీకృష్ణగౌడ్‌ను అభినందించారు.

నియామకపత్రం అందుకుంటున్న మురళీకృష్ణగౌడ్

సచివాలయాలు తనిఖీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

గాండ్లపెంటతో పాటు మండలంలోని సోమయాజులపల్లి, మల్లమీదపల్లి, వేపరాల, కురుమామిడి, తదితర సచివాలయాలు శనివారం ఎంపిడిఒ రామకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ పద్మనాభంరెడ్డి పరిశీలించారు. వారు హాజర పట్టిక, తదితర రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభు త్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. సమయ పాలన పాటించాలన్నారు. సచివాలయానికి వచ్చిన ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రాజేష్, పూజిత, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

కొత్తచెరువు : మండలంలోని నాగిరెడ్డిపల్లి, మైలసముద్రం గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ నటరాజు సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపిడిఒ సాధిక్‌అలీ, ఉద్యోగులు ఉన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభం

ప్రజాశక్తి-కదిరిటౌన్

కదిరి నుంచి మదనపల్లి, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు వెళ్లే ప్రయాణికులకు రైల్వే గేట్ నుంచి విముక్తి లభించిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కదిరి రూరల్ మండలంలో ఎన్‌హెచ్-42 నేషనల్ హైవే, కౌలేపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-19 మధ్యలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ 2 ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసిందన్నారు. కౌలేపల్లి, జోగన్న పేట బ్రిడ్జి ఎన్‌డిఎ ప్రభుత్వంలో మంజూరు కాగా వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే సమస్యను పరిష్కరించి ఎన్‌హెచ్-42 నేషనల్ హైవే ఫ్లై ఓవర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఇది ప్రజల పట్ల కూటం ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు చంద్ర, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న వీరయ్య

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-చిలమత్తూరు

అనారోగ్యంతో బాధపడుతున్న పేదల ఆరోగ్య భద్రతకు సిఎంఆర్ఎఫ్ పథకం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ వీరయ్య తెలిపారు. సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను శనివారం హిందూపురంలోని టిడిపి కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని చాగలేరు పంచాయతీకి చెందిన రాజేశ్వరి భర్త లక్ష్మీనారాయణకు రూ. 52,550 చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిన్న ప్రవీణ్, టిడిపి కన్వీనర్ శ్రీనివాసులు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని శాంతినగర్ హైస్కూల్‌లో శనివారం 52 మంది పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, బాబ్‌జాన్, మల్లికార్జునరెడ్డి ఆర్థిక సహకారంతో యుటిఎఫ్ మోడల్ పేపర్లు అందజేశారు. హెచ్‌ఎం ఉమాపతి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత మోడల్ పేపర్స్ రూపొందించడం అభినందనీ యమన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల చేత వీటిని బాగా చదివించి మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. అలాగే చదువులో వెనుకబడ్డ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ చేసిన యుటిఎఫ్ నాయకులు

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-తలుపుల

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మండలంలోని కుర్లి గ్రామలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలను బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరినీ నేరుగా కలిసి విజ్ఞప్తులు స్వీకరించడంతో పాటు ఆయా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, శంకర్, జయచంద్ర, రామ్మోహన్, కొమ్మెర శీను, తదితరులు పాల్గొన్నారు.

పజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రాజ్యాంగ నిర్మాతకు నివాళి

గాండ్లపెంటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

లేపాక్షిలో..

రొద్దంలో..

హిందూపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్, టిడిపి నాయకులు

కదిరిలో అంబేద్కర్ వర్థంతి సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

గోరంట్లలో..

చెన్నేకొత్తపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళు లర్పిస్తున్న అధికారులు, నాయకులు

అమడగూరులో అంబేద్కర్ చిత్రపటాలను ఊరేగిస్తున్న విద్యార్థులు